క్లుప్తంగా

నేడు పటాన్‌చెరుకు మంత్రి హరీష్‌రావు రాక

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు రానున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రీడమ్ పార్క్ ప్రారంభోత్సవం, అనంతరం వార్డు కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన, డీసీసీబీ బ్యాంకు నూతన భవనాన్ని, ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ నూతన భవనం తదితరాలను ప్రారంభిస్తారని తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని డాల్ఫిన్ దుర్గా కౌంటీ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం నల్లగండ్ల సిటిజన్ ఆసుపత్రి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. వ్యాయామం, మెడిటేషన్, యోగ, ధ్యానం, వాకింగ్ చేయాలన్నారు. శిబిరంలో 170 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సాయికృష్ణ, కొండా శ్రీనివాస్, మల్లేష్, అశోక్ యాదవ్, ఆస్పత్రి ప్రతినిధి హరీష్ పాల్గొన్నారు.

అంబీర్ చెరువు పరిసరాలు శుభ్రం



అంబీర్‌చెరువు వాకింగ్‌ట్రాక్ వద్ద మొక్కలు నాటుతున్న వాలంటీర్లు

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువులో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైటెక్ సిటీకి చెందిన రెండు ప్రైవేట్ సంస్థలు మూడు రోజుల పాటు చెత్తా చెదారాన్ని తొలగించారు. సుమారు 450 మంది వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని 2500 కేజీల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. చెరువు వాకింగ్ ట్రాక్‌పై మొక్కలు నాటి ట్రీగార్డ్‌లు ఏర్పాటు చేశారు. తమ సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వాలంటీర్స్ పేర్కొన్నారు.

భూపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



భూపాల్‌రెడ్డికి శుభకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన శాసనమండలి మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డిని ఆదివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, పటాన్‌చెరు మండల అధ్యక్షులు పాండు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని 11కేవీ ఇజ్జత్‌నగర్, 11కేవీ ఎస్ఐఎ, 11కేవీ ఖానామెట్ ఫీడర్‌ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఇజ్జత్‌నగర్, ప్రభుత్వ పాఠశాల, గౌస్ బిల్డింగ్, యశోద హాస్పిటల్ వెనుక వైపు.. అలాగే సర్వే ఆఫ్ ఇండియా 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెక్షన్ ఆఫీస్, అప్నాబజార్ లైన్, చంద్రనాయక్‌తండా తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: జేపీఎన్‌నగర్, లోటస్ కాలనీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జేపీఎన్‌నగర్, నాగార్జున ఎన్‌క్లేవ్.. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు లోటస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.



పీజేఆర్ స్టేడియం వద్ద ప్రహరీ గోడ ఉన్న రోడ్డు ఇరుకుగా మారిన దృశ్యం



అసలే ఇరుకు.. ఆపై వాహనాల రద్దీ

- రోడ్డు విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యకు చెక్
- పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే ట్రాక్ వరకు ఇబ్బందులు



చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకు రోడ్డు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వరకు రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం గచ్చిబౌలి, నానక్‌రాంగూడ వెళ్ళే ఐటీ ఉద్యోగులు.. ప్రధానంగా చందానగర్, గంగారం, మదీనాగూడలకు చెందిన వాహనదారులు పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ మీదుగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తుంటారు. కాగా పీజేఆర్ స్టేడియం వద్ద కాలనీకి ఆనుకొని ప్రహరీ గోడ ఉండడంతో ఒక వాహనం వెళ్ళేందుకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో లింగంపల్లి అండర్ బ్రిడ్జి నుంచి పీజేఆర్ స్టేడియం వరకు ట్రాఫిక్‌తో నరకం కనబడుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు రోడ్డు విస్తరణ చేయాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలి
- పీజేఆర్ స్టేడియం ప్రహరీ గోడ కొంతమేర తగ్గిస్తే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది.
- రోడ్డు ఇరుకుగా మారడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు.
- భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు చేసినా ప్రమాదకరమని తొలగించడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది.
- గతంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు రోడ్డు విస్తరణపై వినతి పత్రాలు అందించామని ఫలితం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.
- ఎమ్మెల్యే గాంధీ రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ అధికారులకు వినతి పత్రాలు అందించా



చందానగర్ పీజేఆర్ స్టేడియం ప్రహరి గోడ 5 ఫీట్ల మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ స్థలం కాబట్టి గోడ పక్కకు జరిపితే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చు. గతంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, చందానగర్ ఉప కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించా. కానీ ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– తాడిబోయిన రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

నరకం చూస్తున్నా....



చందానగర్ నుంచి గచ్చిబౌలిలోని కార్యాలయంకు వెళ్ళాలంటే పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ట్రాఫిక్‌లో ఇక్కుపోయి 100 మీటర్ల దాటాలంటే అరగంట పడుతుంది. ఉదయం, సాయంత్రం సమయాలలో తీవ్రంగా ఉంటుంది. చందానగర్‌లోని అంతర్గత రోడ్లు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి. ఇప్పటికైన అధికారులు రోడ్డు విస్తరణ చేపట్టాలి.

–జయప్రకాష్, వాహనదారుడు

సమగ్ర ప్రణాళికతో అమీన్‌పూర్ అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు టీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు.ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సేంతన్ గ్రీన్ పార్క్ హోమ్స్, ప్రణీత్ ప్రణవ్ పనోరమా కాలనీలలో స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కు, హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు.భవానీనగర్, ఐటి డబ్ల్యూ సిగ్నోడ్ కాలనీ, భవానిపురం కాలనీల చౌరస్తాలో ఏర్పాటుచేసిన మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు.తదనంతరం టైలర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీకి చెందిన యువకులు, మహిళలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన అమీన్‌పూర్ మున్సిపాలిటీని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పది సంవత్సరాల క్రితం అమీన్‌పూర్ అభివృద్ధి, నేడు జరిగిన అభివృద్ధి పనులను గమనించి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు సీనియర్ నాయకులు కాలనీ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కనువిందు.. కూచిపూడి నృత్యం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గణేశకైతం, రుక్మిణీ ప్రవేశం, బ్రహ్మమొక్కటే అంశాలను ప్రదర్శించి అలరించారు. వరంగల్‌కి చెందిన కూచిపూడి నాట్యగురువు తాడూరి రేణుక శిష్యబృందం ఆనందనర్తన, గణపతిమ్, బ్రహ్మాంజలి, మహాగణపతిం, ఇదిగో భద్రాద్రి తదితర అంశాలను ప్రదర్శించారు. సాయిచరణ్, రాధిక, రిషిత, విలాసిని, భ్రమరీ, అద్వైత, అవని, ఆరాధ్య, నిశిత, వరాళిక, తదితరులు పాల్గొన్నారు. నటులు బి.ఎం.రెడ్డి, దర్శకులు ప్రవీణ్‌చందర్‌లు కళాకారులను నాట్యరత్న, నాట్యబాల అవార్డులతో సత్కరించారు.



ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జీరం మల్లేష్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేష్

పటాన్‌చెరు టౌన్: ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేష్, పార్లే ఆగ్రో యూనియన్ అధ్యక్షుడు రాజయ్య అన్నారు. పార్లే పరిశ్రమలో వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో అభినందన సభను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఐటీయూ కార్మికుల పక్షాన ఎల్లవేళలా ఉంటూ వారి కష్టసుఖాలలో పాలు పంచుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పాండు రంగారెడ్డి, కిర్బి నాయకులు సుధాకర్, తలారి శ్రీనివాస్ ,క్రౌన్ బీర్ నాయకులు శ్రీధర్, పార్లే యూనియన్ నాయకులు సంతోష్ గౌడ్, జంగయ్య, కిరణ్, సుజిత్, సుధాకర్, రాజశేఖర్, రాములు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి పట్టు వస్త్రాలు సమర్పణ

పటాన్‌చెరు టౌన్: ఆషాఢమాసం బోనాలు ముఖ్యమైనవని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు.ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో ప్రముఖ్‌నగర్ కాలనీలో పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం సందర్భంగా నీలం మధు ముదిరాజ్ స్థానిక ఇస్నాపూర్ సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలంలతో కలసి పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు నీలం మధు ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గడ్డం బాలమణి, ఎంపీటీసి గడ్డం శ్రీశైలం ,రఘు, గాంగరపు సతీష్(గోపి), శ్రీనివాస్ గౌడ్, జాతర నిర్వాహకులు ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తెస్తున్న నీలం మధు ముదిరాజ్

కాలనీల్లో వసతుల కల్పనే ధ్యేయం



లింగంపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా లింగంపల్లి ఎస్సీ బస్తీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ కాలనీల్లో మెరుగైన వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు ఉన్నాయన్నారు. అదే విధంగా వెంకట్‌రెడ్డి కాలనీ, బృందావన్ కాలనీల్లో సీసీ రోడ్ల పనుల విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు వీరేశంగౌడ్, రాంచందర్, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, రవియాదవ్, అజీమ్, సుభాష్ రాథోడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవం



పతాకావిష్కరణ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, సభ్యులు

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు అక్షయ్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ ప్రధానగేటు వద్ద ఏబీవీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సందీప్, మహేష్,పర్ణిక, ఫణీంద్రా, తులసీరామ్, తరుణ్, అయేషా, రవి, శ్రితిక, రితాంజలి, వికాస్, పృథ్వీ, సాక్షి, బాలకృష్ణ, రాజేంద్రమీనా పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్ సూచించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్‌లో ఆదివారం 'ప్లాంటేషన్ డ్రైవ్' ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పలు డిపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, హాస్టళ్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌ను గ్రీన్ క్యాంపస్‌గా మార్చేందుకు ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని, క్లీన్ క్యాంపస్‌గా మార్చేందుకు క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాలను ప్రతియేటా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సందీప్, మహేష్, పర్ణిక, గోపాల్, యశస్విచ వెంకట్‌సాయి,అవినాష్, శివ, సెబాంతి, అలేఖ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం

హఫీజ్‌పేట్ : చందానగర్‌లో దివి ఉమెన్ ఫెర్టిలిటీ సెంటర్‌ను కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, అక్బర్ ఖాన్, సందీప్‌రెడ్డి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తెలిపారు.ఆదివారం డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చివరి రోడ్డు, నందన్ రతన్ ప్రైడ్ కాలనీలోని రోడ్డు నంబర్ 1 లో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.42 లక్షలతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని కాలనీల్లో సుమారు రూ.8.46 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు క్యాంప్ కార్యాలయ అధికారులు తెలిపారు. లింగంపల్లి విలేజ్ నుంచి తారానగర్ వరకు వరదనీటి కాలువ పనులను రూ.5.5 కోట్లతో, వెంకట్‌రెడ్డి కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు పనులు, బృందావన్ కాలనీలో రూ.46లక్షలతో సీసీ రోడ్డు, భాగ్యలక్ష్మీ కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు, శిల గార్డెన్ కాలనీలో రూ, 50 లక్షలతో సీసీ రోడ్డు, సెంట్రల్ పార్కు ఫేజ్–2 కాలనీలో కోటి రూపాయలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

చందానగర్‌లో మీ సేవ కేంద్రం ప్రారంభం



హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని న్యూ శంకర్‌నగర్‌లో మీ సేవ కేంద్రంను ఆదివారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, అక్బర్ ఖాన్, సందీప్‌రెడ్డి, వరలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వరద నీటి కాలువ పనులు పరిశీలన



బృందావన్ కాలనీలో వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా వరదనీటి కాల్వ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడైతే రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతుందో ఆయా ప్రాంతాలను గుర్తించి వరదనీటి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు రవి, బోసుబాబు, కోటేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కిషోర్, ఆదిత్య, అనిల్, వినయ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలతో అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు జీహెచ్‌యంసీ కమిషనర్ ఆదేశాలతో ఆదివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీలో ఎంటమాలజి సూపర్‌వైజర్ నరసింహులు, సిబ్బందితో కలిసి ఆదివారం 10 గంటల 10 నిమిషాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాలని, సంపులు, డ్రమ్ములు, పూలకుండీలు, టైర్లు కూలర్స్. కుండలు, నల్లా గుంతలు ప్లాస్టిక్ సెంటెక్స్, రిఫ్రిజిరేటర్, ప్లాస్టిక్ డబ్బాలను వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్న వాటికి మూతలుపెట్టుకోవాలని సూచించారు. దోమలతో డెంగ్యూ జ్వరం, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీజేఆర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

బోనాల జాతర

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ చేరువలోని రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దర్శించుకొన్నారు. పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, ప్రవీణ్,జగదీష్, మల్లేష్‌రెడ్డితోపాటు పలువురు భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. పూజల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

బోనాల వేడుకల్లో మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ముచ్చా సత్యనారాయణ, పలువురు బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో..

హఫీజ్‌పేట్ : చందానగర్ హుడా కాలనీలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, మనోహర్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శనగర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



చందానగర్‌లో రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గాంధీ